క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి మహిళ తరలింపు


మహిళను వృద్ధాశ్రమానికి తీసుకు వచ్చిన భాస్కరరావు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని సర్వీసురోడ్డుపై కదల్లేని స్థితిలో ఉన్న మహిళను సామాజిక సేవా కార్యకర్త చెల్లూరి భాస్కరరావు గాజువాక పోలీసుల సాయంతో నగరంలోని వృద్ధాశ్రమానికి ఆదివారం తరలించారు. వారం నుంచి జింక్‌కు సమీపంలో సుమారు 48 ఏళ్ల మహిళ సంచరిస్తుందని,ఆమెను వివరాలు అడిగితే రోదించడం తప్పితే వివరాలు చెప్పలేదని చెల్లూరి భాస్కరరావు వివరించారు.

హెచ్‌ఎస్‌బీ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు అభినందన


డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

సింథియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ షిప్ బిల్డింగ్ డైరెక్టర్‌గా గండి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా షిప్‌యార్డ్ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు ఉరుకూటి మురళి, ప్రధానకార్యదర్శి సీహెచ్ రాము ఆధ్వర్యంలో టీఎన్‌టీయూసీ నాయకులు గండి వెంకటేశ్వర్లును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే విధంగా కృషి చేయాలని కోరారు. అదే విధంగా కార్మికులు క్రిస్మస్, సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో చేసుకునేలా లీవ్ క్యాష్ మెంట్ అమౌంట్ ఇప్పించే విధంగా కృషి చేయాలని అభ్యర్థించారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి, హారతి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ప్రభుత్వాస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం

విశాఖ విద్య:గోపాలపట్నం ప్రభుత్వాస్పత్రిలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు దీనిని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యేగణబాబు సందర్శించారు. ఇలాంటి వైద్య శిబిరాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని సూచించారు.

సంత.. సమస్యల చెంత


జనతాకాలనీలో రోడ్డుపై నిర్వహిస్తున్న సంత

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది అక్కడ పరిస్థితి. వ్యాపారులకు వసతితో పాటు ట్రాఫిక్ ఇక్కట్లకు చెక్ పెట్టాలనే ఆలోచనతో చేసిన నిర్మాణాలు అలంకార ప్రాయంగా మారాయి. ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించి స్టే తేవడంతో అక్కడి సంత సమస్యల చెంత నడుస్తోంది. ఎండైనా.. వానైనా రోడ్డుపైనే సంత నిర్వహిస్తున్నారు. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.

- షాపుల ప్రారంభానికి కోర్టు స్టే అడ్డు
- పదేళ్లుగా అలంకార ప్రాయంగా షెడ్లు
- ఎండైనా..వానైనా రోడ్డుపైనే వ్యాపారాలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, పాదచారులు



మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతాకాలనీ సెంటర్‌లో పలు వాణిజ్య దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు చాలా మంది తోపుడుబళ్ల వ్యాపారులు వాణిజ్య దుకాణాలకు ముందు సేవా మార్గంపై వ్యాపారాలు సాగిస్తుంటారు. వీరితో పాటు ప్రతి బుధవారం వారపు సంత జరుగుతుంది. సుమారు కిలోమీటరు మేర సర్వీసురోడ్డుకు ఇరువైపులా తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటు చేస్తారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఈ సమస్యకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో అప్పటి పశ్చిమ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ నిత్యం ఇక్కడ వ్యాపారాలు చేసుకునే వారి కోసం రక్షణ గోడకు ఆనుకుని షెడ్లు నిర్మించారు.

కోర్టును ఆశ్రయించడంతో ప్రారంభోత్సానికి బ్రేక్

అయితే రక్షణగోడకు ఆనుకుని ఉన్న ఓ ఇంటి యజమాని తన స్థలంలో షెడ్లు నిర్మించారని కోర్టును ఆశ్రయించాడు. దీనిపై కోర్టు స్టే ఇవ్వడంతో పుష్కరకాలం గడుస్తున్నా షెడ్లు ప్రారంభానికి నోచుకోలేదు. వివాదం పరిష్కారంపై అధికారులు, పాలకులు దృష్టి సారించలేదు.

ప్రత్యామ్నాయం లేక రోడ్డుపైనే దుకాణాలు

షెడ్లు లేకపోవడంతో వ్యాపారులు సర్వీసురోడ్డుకు ఇరువైపులా తమ తమ వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో ఆ మార్గాన వచ్చే వాహనదారులతో పాటు,పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరో వైపు బస్సు తప్పించుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.రోడ్డుపై వ్యాపారాలు.. ఇరుపైపులా వాహనాల పార్కింగ్ వల్ల బస్సు రాకపోకలకు ఇబ్బంది కరంగా ఉంటుంది. అధికారులు సమస్యపై స్పందించి బస్సు సర్వీస్ నడిచే మార్గంలో కాకుండా ఇతర మార్గంలోకి వ్యాపారులను తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బస్సు రాకపోకలకు ఇబ్బంది



జనతాకాలనీలో సంత సమయంలోనే కాకుండా, సాధారణ రోజుల్లో కూడా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో వాహనాలతో పాటు బస్సు తప్పుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పొరపాటున ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు సమాధానం చెబుతారు. వ్యాపారులను వేరే ప్రాంతానిమార్చితే బాగుంటుంది.
-శంకరరావు, వాహనదారు

నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు



జనతాకాలనీ సెంటర్ ఉదయం, సాయంత్రం చాలా బిజీగా ఉంటుంది.ఆ సమయంలో రోడ్డుపై వ్యాపారుల వల్ల తప్పించుకోలేని పరిస్థితి. దీంతో సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక పోతున్నాం. వ్యాపారులు కూడా ఇబ్బంది పడుతూ వ్యాపారాలు సాగిస్తున్నారు. అధికారులు ఈ సమస్యపై స్పందించాలి.
– సాంబశివరావు, పాదచారుడు)

పాత్రికేయుల చరిత్రలో గీటురాయి 'నార్ల'


సమావేశంలో పాల్గొన్న రచయితలు, పాత్రికేయులు

మల్కాపురం: పాత్రికేయుల చరిత్రలో గీటు రాయి దివంగత నార్ల వెంకటేశ్వరరావు అని ప్రముఖ రచయిత సుంకర చలపతిరావు అన్నారు. సీనియర్ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ఆదివారం వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ నార్ల పాత్రికేయుడుగానే కాకుండా మంచి కవిగా గుర్తింపు పొందారని.. రాజ్యసభ సభ్యుడిగా కూడా ఆయన పని చేశారన్నారు. పాత్రికేయుల కోసం నార్ల చేసిన సేవలు మరవలేనివన్నారు. కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం అధ్యక్షుడు ముప్పిడి వెంకటగిరి,కోశాధికారి లొడగల రాజుయాదవ్, కార్యవర్గ సభ్యులు మజ్జి రమేష్‌పాత్రుడు,డి.శ్రీనివాస్,రాజారావు,మనోహర్,హరీష్ పాల్గొన్నారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు


ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీలోని శివసాయి ఆలయ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గణబాబు సందర్శించారు. సుమారు 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి పరీక్షలు నిర్వహించిన వారికి ఉచితంగా మందులు కూడా అందజేశారు. కొంతమందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించాలని, త్వరలోనే వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామని వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జిమాలి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ వెలమ వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహననాయుడు, జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు, నీలం రాజు, నీలాపు జోగిబాబు, డొప్ప సన్యాసిరావు, చంద్రశేఖర్, లక్ష్మి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు


కంచరపాలెం నుంచి జ్ఞానాపురం వెళ్లే ఫుట్‌పాత్‌పై విరిగిన విద్యుత్ స్తంభం


నేతాజీ ఫ్లైఓవర్‌కు వెళ్లే మార్గంలో..

కంచరపాలెం:ఫెంగల్ తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులకు కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనపై విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో అటుగా వాహనాలు, పాదాచారులు రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మూడు రోజులుగా వీస్తున్న గాలులకు ఆదివారం రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వాటిని ఫుట్‌పాత్‌పై అడ్డంగా వదిలేయడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ జోన్-5 విద్యుత్ దీపాల విభాగాధికారులు స్తంభాలను తరలించి, విరిగిన స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కార్మికులకు అండగా సీపీఐ


కరపత్రాలు పంచుతున్న సీపీఐ నాయకులు

సింథియా: కార్మికులు,రైతుల సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీపీఐ నాయకుడు కాంద్రేగుల సత్యాంజనేయ అన్నారు.
జీవీఎంసీ 61, 62, 63వ వార్డుల్లో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి శాఖలోనూ నిర్మాణ మహాసభలు నిర్వహించాలనే నిర్ణయానికి అనుగుణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత సేవ చేసేందుకు సీపీఐ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు, కనకేశ్వరరావు, కామేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

మూగజీవాల బెడద!


63వ వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు


సింథియా ప్రధాన రహదారిపై గేదెల సంచారం

- విచ్చలవిడిగా సంచరిస్తున్న గేదెలు
- స్వైర విహారం చేస్తున్న గ్రామసింహాలు
- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

సింథియా: పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన రహదారులపై ఒక పక్క పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుంటే.. మరో పక్క వీధి కుక్కలు వెంటాడి మరీ ప్రయాణికులను గాయపరుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో గ్రామ సింహాల స్వైర విహారం అధికమైంది. విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలపై దాడికి పాల్పడుతున్నాయి. దీంతో రోడ్ల పైకి రావాలంటే చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులు భయపడుతున్నారు. చింతల్లోవ, క్రాంతినగర్, జయేంద్రకాలనీ, త్రినాథపురం తదితర ప్రాంతాల్లో గ్రామ సింహాలు గుంపులు, గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు.

నియంత్రణ లేకపోవడం వల్లే..

పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు సరైన దృష్టి సారించకపోవడం వల్లే అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కల కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడం, రేబిస్ వ్యాక్సిన్లు వేయించాలని కోరుతున్నారు.అయితే అది ఖర్చుతో కూడుకున్న పని కావడం , కుక్కలను తీసుకువచ్చి ఆపరేషన్‌కు ముందు, తర్వాత సంరక్షించాల్సిన బాధ్యత ఉండడంతో పట్టించుకోవడం లేదని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపైనే పాడి పశువులు

పశువుల పెంపకందార్లు పాలు తీసిన తర్వాత రోడ్లపైనే విడిచిపెడుతున్నారు. దీంతో అవి రోడ్లపై సంచరించడంతో పాటు రోడ్డుకు అడ్డంగా కూర్చోవడం , రాత్రి సమయాల్లో రోడ్డుపైనే నిద్రించడంతో ప్రయాణికులు వాటిని దాటి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సింథియాన్యూకాలనీ, మార్కెట్‌రోడ్డు, మల్కాపురం-సింథియా ప్రధాన రహదారి ప్రాంతాల్లో పశువులు సంచారం అధికంగా ఉంటోందని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి రహదారులపై పశువులను విడిచిపెట్టకుండా పశువుల పెంపకందార్లను హెచ్చరించాలని ప్రజలు కోరుతున్నారు.

వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సీతంపేట: వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగింది. వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో, అసోసియేషన్ న్యూ పేట్రన్ కమల్‌బైడ్ మాట్లాడుతూ ప్రతిభను చాటి పతకాలను సాధించిన మన అథ్లెట్స్ అంతర్జాతీయ క్రీడా వేదికపై విశాఖ కీర్తి పతాకాన్ని ఎరుగవేయాలన్నారు. అథ్లెట్ అసోసియేషన్ బలోపేతానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి క్రీడాకారులకు సహకారం అందిస్తామని తెలిపారు. జగద్గురు పీఠం డైరెక్టర్, అసోసియేషన్ న్యూ అడ్వైజర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ ఔత్సాహిక క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.రంగారావు, ఎస్‌వీఎస్ ఎల్ఎన్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నాగార్జున తదితరులు సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కార్యవర్గం...

వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం నూతన చీఫ్ పేట్రన్‌గా కమల్‌బైడ్, చీఫ్ అడ్వైజర్‌గా డాక్టర్ చింతలపాటి సత్యదేవ్, పేట్రన్‌గా గోపిశెట్టి ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్‌గా జె.పృథ్వీరాజ్, కోఆర్డినేటర్‌గా చింతలపాటి శ్రీనివాసరాజు, అధ్యక్షుడిగా ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ జనరల్ మంగవరప్రసాద్, కార్యదర్శిగా ఎల్.వి.సుధాకర్, కోశాధికారిగా ఎం.రామారావు, పీఆర్‌వోగా వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ వంశీ చింతలపాటి ప్రమాణ స్వీకారం చేశారు.

చంద్రమౌళీశ్వరుడికి అన్నాభిషేకం


అన్నసమారాధనకు తరలివచ్చిన భక్తులు


చంద్రమౌళీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు


అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత చంద్రమౌళీశ్వరస్వామికి ఆదివారం అన్నాభిషేకం అత్యంత వైభవోపేతంగా జరిగింది. కార్తీక మాసోత్సవాలు ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోలాహలం నడుమ శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రత్యేక పూజల అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సుమారు నాలుగు వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర ఇచ్చారపు, శ్రీనివాసరాజు స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించారు. 35 సంవత్సరాలుగా కార్తీక మాసోత్సవాల ముగింపు సందర్భంగా అన్నసమారాధన నిర్వహిస్తున్నామని నాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు రవిశంకర్, సూర్యనారాయణ, కేఎస్ఎన్ రాజు, భరత్, అజయ్, కృష్ణమోహన్, తిరుపతిరాజు, కిరణ్, హరిశంకర్ పాల్గొన్నారు.

వైభవంగా అఖండ దీప సాగర హారతి


సైకత లింగానికి పూజలు చేస్తున్న భక్తులు

ఏయూక్యాంపస్: కార్తీక మాసంలో చివరి రోజైన ఆదివారం బీచ్ రోడ్డులో అఖండ దీప సాగర హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కాళీమాత ఆలయం ఎదురుగా బీచ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై పండితులు ప్రత్యేకంగా రుద్రాభిషేకం జరిపించారు. భక్తులు స్వయంగా సైకత లింగానికి తమ స్వహస్తాలతో అభిషేకం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మిక పరిమళాన్ని నింపాయి. గౌరీ పరమేశ్వరుల కల్యాణం, సాగర హారతి, సైకత లింగ నిమజ్జనంతో కార్యక్రమం ముగిసింది.

వసతుల కల్పనకు చర్యలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని చేపట మార్కెట్‌లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. తాగునీరు సదుపాయంతో వ్యాపారులు చేపలు భద్రపర్చడానికి సౌకర్యాలు కల్పించనున్నారు. మార్కెట్‌లో సమస్యలను వ్యాపారులు ఎమ్మెల్యే పి.గణబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించడంతో పోతాబత్తుల శ్రీను ఆదివారం వ్యాపారుల సమస్యలను తెలుసుకున్నారు.

క్రీడా నైపుణ్యం వెలికితీసేలా పోటీలు



ఫుట్‌బాల్ క్రీడాకారులతో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ విజయ్‌మోహన్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలను ఆదివారం ఏయూ గోల్డెన్ జూబ్లీ క్రీడా మైదానంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు ప్రారంభించారు. ఈ పోటీలకు ఏయూ ఎఫిలియేషన్ కళాశాలల నుంచి వంద మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి మేరకు వారిలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ సాధించిన క్రీడాకారులు ఏయూ జట్టు తరపున పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి ఆచార్య ఎస్.విజయమోహన్ మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పీడీ డాక్టర్ లక్ష్మణ్‌రెడ్డి, ఐపీఈ క్రీడాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు పి.శ్రీనివాసరావు, పరిశోధకుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

విశాఖ విద్య: నిష్కామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏయూ క్యాంపస్‌లోని డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో 'ధ్యానం: నిర్విషయం మనః' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అరుణాజీ ప్రసంగిస్తూ ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ధ్యానం ప్రాముఖ్యత, మనసును నియంత్రించడం ధ్యాన సాధనలో ఎంత ముఖ్యమో వివరించారు. ధ్యాన సాధనలో ఎదురయ్యే అవరోధాలు, ధ్యానం చేయడానికి అనుసరించవలసిన విధానాలను తెలియజేశారు. ముఖ్య అతిథి డాక్టర్ పి.వి.సుధాకర్(అనిల్ నీరుకొండ ఎడ్యుకేషన్ సొసైటీ డీన్) నిష్కామ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. భగవద్గీత అధ్యయనం ప్రాముఖ్యతను విశదీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ కుమార రాజా (కుమార రాజా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్) తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వినోదాల విందు


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ కళాకారులు ప్రదర్శించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, భానుప్రకాష్, నాయుడు, పోర్టు శేషు, ఇమంది ఈశ్వరరావు, రామానుజం, శివజ్యోతి, సీత, వెంకటేశ్వరరావు కామెడీ స్కిట్లు ప్రదర్శించి నవ్వులు పంచారు. కనబడటం లేదు, కుర్చీని వదలడం లేదు, అప్పడాల కర్ర, సినిమా షూటింగ్, రంభ సూపర్ మార్కెట్, ధర్మం చెయ్యండి, సెల్‌ఫోన్ రిపేర్, తమ్ముళ్లతో తంటా, డాక్టర్ పేషెంట్, పతియే ప్రత్యక్ష దైవం, కాలు జారింది వంటి కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ముందుగా ఇటీవల మరణించిన బాదంగీర్ సాయి ఆత్మశాంతికి రెండు నిమిషాల మౌనం పాటించారు. అతిథులు తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, వి.వి.కృష్ణంరాజు చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.